క్లుప్తంగా

సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు



సంత్‌సేవాలాల్‌కు పూజలు చేస్తున్న నాయకులు

కడ్తాల్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్‌కు ఆదివారం డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ గుప్తా ప్రత్యేక పూజలు చేశారు. సేవాలాల్ జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా గుత్తి మండలం రాంజీ తండాలోని సంత్ సేవాలాల్ ఆలయాన్ని వెంకటేశ్‌గుప్తా ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలువురు నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు
చీకట్లో కొత్తగూడెం చౌరస్తా



విజయవాడ జాతీయ రహదారిపై కొత్తగూడెం కూడలిలో పని చేయని హైమాస్ట్ లైట్లు

అబ్దుల్లాపూర్‌మెట్ : మండల కేంద్రంలోని బాటసింగారం పంచాయతీ కొత్తగూడెం చౌరస్తా విజయవాడ జాతీయ రహదారిపై 15 రోజులుగా హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. దీం సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకూ చీకటి నెలకొంటోంది. నిత్యం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే వాహనాలతో పాటు జాతీయ రహదారిపై రాకపోకలు కొనసాగించే వేలాది వాహనాలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా జాతీయ రహదారిని దాటడానికి ప్రజలు జంకుతున్నారు. పంచాయతీ అధికారులు, మార్కెట్ శాఖ అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్లకు మరమ్మత్తులు చేయించి కొత్తగూడెం కూడలిలో వెలుగు వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొదుపు సంఘం వార్షికోత్సవం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఆదివారం శ్రీరామ రెడ్డి పొదుపు సంఘం ఐదోవార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు గొడెల్లి దామోదర్ రెడ్డి, అధ్యక్షుడు సూరెడ్డి నాగేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి భాస్కర్ రెడ్డి, ఉప కార్యదర్శి లక్ష్మారెడ్డి, కోశాధికారి కొండకింది సురేందర్ రెడ్డి పర్యవేక్షణలో గడిచిన ఐదేళ్లలో పొదుపు వివరాలను పరిశీలించారు. మొత్తం 170 మంది సభ్యులు కలిగిన ఈ సంఘంలో పొదుపు పాటించి ప్రతిఒక్కరూ ఆర్థికంగా ఎదిగేందుకు సహకరిస్తామన్నారు.

దేవాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజల్లో పాల్గొన్న భక్తులు

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి శ్రీకృష్ణదేవరాయనగర్‌లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నాలుగు రోజులపాటు నిర్వహించనున్న ఆలయ త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహస్వామికి 108 కలశాలతో అభిషేకం, సంప్రోక్షణ సామూహిక కుంకుమార్చన, విష్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మృత్యం గ్రహణం, అంకురార్పణం, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

వనస్థలిపురం: వనస్థలిపురం హుడా కాలనీ ఏ టైప్ క్వార్టర్స్‌లో పోచమ్మ అమ్మవారి దేవాలయం వద్ద కిరణ్‌జిత్ తల్లి భజన్ కౌర్ తూర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్, ఫ్రిడ్జ్‌ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు.

చకచకా కొత్త ఆస్పత్రి

- నూతన భవన నిర్మాణానికి రూ.17.5కోట్ల నిధులు
- అక్టోబర్ నాటికి అందుబాటులోకి
- పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు



ఆమనగల్లులో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం

ఆమనగల్లు: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రి భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. పాత ఆస్పత్రి భవనం స్థానంలో రూ.17.5కోట్లు వెచ్చించి నూతన భవనం నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులను అక్టోబర్ నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

పాత ఆస్పత్రి భవనం స్థానంలో

పట్టణంలోని ప్రధాన రహదారిపై దాదాపు 50 ఏళ్ల క్రితం 30 పడకల ప్రభుత్వాస్పత్రి భవనం నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడం, ప్రజలకు సరైన వైద్య సేవలు అందకపోవడంతో ఆస్పత్రి స్థాయిని పెంచి నూతన భవనం నిర్మించాలని ప్రజలు ఏళ్ల నుంచి ఆందోళన చేపడుతున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలోనూ నిరసన దీక్షలు చేపట్టారు. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం శంకుస్థాపన చేసినా నిధులు విడుదలలో తాత్సారం చేయడంతో పనులు ప్రారంభం కాలేదు.

రెండు సార్లు శంకుస్థాపన

పట్టణంలో నూతన ఆస్పత్రి భవన నిర్మాణానికి వైద్య విధాన పరిషత్ నుంచి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.17.5 కోట్లు మంజూరు చేసింది. దీంతో పాత ఆసుపత్రి భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. 2023 ఆగస్టు 18న నూతన భవనం నిర్మాణానికి అప్పటి మంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. టెండర్లు పూర్తయినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నిధులు విడుదల చేయించారు. 2024 జూలై 10న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మరోసారి శంకుస్థాపన చేశారు.

వేగంగా నిర్మాణ పనులు

పట్టణంలోని పాత ఆస్పత్రి భవనాన్ని కూల్చివేసిన అనంతరం అదే స్థలంలో నూతన భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఆస్పత్రి భవనం ఎదుట ఉన్న డాక్టర్స్ క్వార్టర్స్‌లో వైద్య సేవలు కొనసాగుతున్నాయి. మూడు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ నూతన భవనంలో అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు ఎస్ఈ సురేందర్‌రెడ్డి, ఈఈ అబ్దుల్ అజీజ్, డీఈ రవీందర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. మంజూరైన నిధులలో భవన నిర్మాణానికి రూ.12 కోట్లు, భవనంలో ఆస్పత్రి సామగ్రికి రూ.5.5 కోట్లు ఖర్చుచేయనున్నట్లు అధికారులు వివరించారు. నూతన భవనంలో ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

ఉన్నత విద్యామండలి ఛైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి



బాలకృష్ణారెడ్డికి జ్ఞాపిక బహూకరిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: పోటీ ప్రపంచానికి తగినట్లుగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. శ్రీదత్త విద్యాసంస్థలో శనివారం రాత్రి ఇన్ఫినిటీ-2కే25 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునుఇ భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం శ్రీ దత్త విద్యా సంస్థల చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థి సింగర్ కృష్ణచైతన్య బృందం పాడిన పాటలు , జాతిరత్నాలు ఫేమ్ హీరోయిన్ ఫరియా అబ్దుల్లా, జబర్దస్త్ ఫేమ్ సద్దాం, నవసందీప్, జ్ఞానేశ్వర్ కామెడీలు ఆహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, శ్రీదత్త విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ జీఎస్‌వీ విభవ్‌రెడ్డి, రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూషన్ మాజీ డైరెక్టర్ వైజయంతి, అకాడమిక్స్ డీన్ అచ్యుత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్స్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సెంథిల్ కుమార్ పాల్గొన్నారు.

అవినీతికి తావివ్వొద్దు

ఏపీఓ కృష్ణ

తలకొండపల్లి: సామాజిక తనిఖీ సభలను పకడ్బందీగా నిర్వహించాలని ఏపీఓ కృష్ణ అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్, లింగరావుపల్లి, చెన్నారం గ్రామాల్లో శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించారు. ఉపాధి హామీ కార్యక్రమాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకొని అవినీతికి తావు లేకుండా నిధులను ఉపయోగించుకోవాలని ఏపీఓ కృష్ణ సూచించారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్స్, డీపీఆర్‌ఓలు, ఈసీలు, ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులతో మల్‌రెడ్డి రాంరెడ్డి

తుర్కయంజాల్: బ్రాహ్మణ కుటుంబాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధి కమ్మగూడ టీచర్స్ కాలనీ సాయిగణపతి ఆలయంలో నియోజకవర్గ బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ రావు, కోశాధికారి వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్‌రావు, వసంతరావు, వెంకటశివ కుమార్, రుక్మిణి, సహాయ కార్యదర్శులుగా రాధిక, శివ రామారావు, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశ్వర రావు, కార్యవర్గ సభ్యుడిగా గౌతరాజు రఘురాంను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ లీడ్ క్యాప్ చైర్మన్ తులసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



తుక్కుగూడ: సర్దార్‌నగర్‌లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్‌లో నేతలు



హుడాకాంప్లెక్స్: అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కేఎల్ఆర్, దేప భాస్కర్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి

హుడాకాంప్లెక్స్: రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచెన్న గారి లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకుడు, టీపీసీసీ సభ్యుడు దేపభాస్కర్ రెడ్డి, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ భార్గవ్ రాములు హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా దేశ ప్రజలను చైతన్యవంతం చేశారని గుర్తు చేశారు. 11 ఏళ్లగా రాజ్యాంగాన్ని రాజ్యాంగ విలువలను కాలగర్భంలో కలిపేసే ప్రయత్నం బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. జనవరిలో పార్లమెంట్ వేదికగా కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేందర్ యాదవ్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు చిక్కుళ్ల శివ ప్రసాద్, గుల్షన్, షఫీ, గంగమ్మ కిషోర్, యూనుస్, అజీజ్, సంతోష్ కుమార్, నాగరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం తుక్కుగూడ పురపాలిక వ్యాప్తంగా కొనసాగుతుంది. ఆదివారం పుర పరిధిలోని సర్దార్‌నగర్ గ్రామంలో నిర్వహించారు.

గాంధీ కుటుంబంపై బీజేపీ కుట్ర

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన
- మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మల దహనం



ఆమనగల్లు: మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ప్రధాని మోదీ, బీజేపీ సోనియా గాంధీ కుటుంబంపై రాజకీయ కుట్రకు పాల్పడుతున్నారని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ అన్నారు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలుకు నిరసనగా ఆదివారం పట్టణంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గాంధీ కుటుంబంపై కక్షసాధింపు చర్యలు తగవన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేయడాన్ని దేశప్రజలంతా ఖండించాలని కోరారు. ఈడీ, సీబీఐలను ఉపయోగించుకుని బీజేపీ కాంగ్రెస్‌ను బలహీనపరిచేందుకు యత్నిస్తోందని ఆరోపించారు. ప్రధానమంత్రి మోదీ చర్యలను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, మాజీ సర్పంచ్ పర్వతాలు, కాంగ్రెస్ సేవాదల్ నాయకులు దశరథం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు ఖాదర్, కృష్ణయ్య, కరీం, సాయి, రఫీ, కుమార్‌గౌడ్, జగదీశ్, ఆనంద్, రాకేశ్, శివకుమార్, అనిల్, అంజయ్య, విజేందర్ తదితరులు ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, దేశ నాయకుడు రాహుల్ గాంధీ పేర్లు అప్రజాస్వామికంగా చార్జ్‌షీట్‌లో చేర్చారనే నేపథ్యంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా దిష్టి బొమ్మలను మండల కేంద్రంలో ఆదివారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ అజీం, కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి నరేష్, పట్టణ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు రమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వనస్థలిపురం: ప్రగ్న, లాలిత్యం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వరకాలనీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ డా.వంశీమోహన్ మాట్లాడుతూ.. పేదలు, మురికివాడల్లో నివసించే వారికి ఉచితంగా వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పి.కృష్ణ, డా.క్రాంతి, జీఎం బాలరాజ్, క్యాంప్ కోఆర్డినేటర్ మహేష్‌గౌడ్, ఆంజనేయులు, మహేష్, రామాచారి పాల్గొన్నారు.

సమాజ సేవకు సమయం వెచ్చించండి

భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్ అచ్యుత్

ఇబ్రహీంపట్నం రూరల్: సమాజ సేవకు భారతీయులు అధిక సమయం కేటాయించాలని భాగ్యనగర్ విభాగ్ ప్రచారక్ అచ్యుత్ అన్నారు. ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వీరపట్నం భాగ్ శాఖల సమ్మేళనం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి మంగళ్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అచ్యుత్ మాట్లాడుతూ.. ఈ దేశం నాది అనే భావనలో జీవిస్తే ఈ దేశపు సమస్యలన్నీ తొలగిపోతాయన్నారు. మన దేశం దైవ భూమి, పుణ్యభూమి అని కొనియాడారు. శ్రీరాముడి వారసులమని హిందువుగా జన్మించినందుకు గర్వించాలని చెప్పారు. స్వామి వివేకానంద లాంటి వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. సంఘ శాఖల ద్వారా సంస్కారాలు, క్రమశిక్షణ అలవడతాయని వివరించారు. సంఘ శాఖలు పెంచేందుకు యత్నించాలన్నారు. ఈ ఏడాది విజయదశమి నుంచి 2026 విజయ దశమి వరకు నిర్వహించే సంఘ శతాబ్ది ఉత్సవాలకు సమయం కేటాయించాలన్నారు. దేశాన్ని ప్రపంచంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో మనవంతు కృషి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం భాగ్ కార్యవాహ రమేష్, లింగం, అంజి, మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల స్వయం సేవకులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



యాచారం: రాష్ట్రంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండలం మాల్ గ్రామ పంచాయతీకి ఆత్మ నిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. తాను మలక్‌పేట ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో హయత్‌నగర్ మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలుంటే 23 గ్రామ పంచాయతీలకు నిర్మల్ పురస్కార్ అవార్డులు వచ్చినట్లు గుర్తు చేశారు. పాఠశాలల అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తానని అన్నారు. మాల్ గ్రామ పంచాయతీని ఆత్మ నిర్భర్ పంచాయతీ స్పెషల్ అవార్డుకు ఎంపిక చేసినందుకు కేంద్ర, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్సీఐ రహదారిని విస్తరించేనా?

- ఆరు నెలలు గడిచినా ప్రారంభం కాని పనులు
- నిధులు మంజూరైనా ముందుకు సాగని వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



విస్తరణ పనులు ప్రారంభం కాని ఆర్సీఐ రహదారి

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ నుంచి ఆర్సీఐ వెళ్లే రహదారి విస్తరణకు శంకుస్థాపన నిర్వహించి ఆరు నెలలు గడిచినా నేటికీ పనులు ప్రారంభించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యతో ఈ రహదారిపై ట్రాఫిక్ నెమ్మదించడంతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పహాడీషరీఫ్ బైపాస్‌లోని ఎయిర్‌పోర్ట్ హోటల్ నుంచి ఆర్‌సీఐ కూడలి వరకు 150 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ కోసం రూ.34 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు గతేడాది నవంబర్ 30వ తేదీనా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తయితే సాఫీగా రాకపోకలు సాగించాలనుకున్న వాహనదారులకు మాత్రం ఎదురు చూపులు తప్పడం లేదు.

ఎర్రకుంట రహదారికి..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శ్రీశైలం హైవేలో హైదరాబాద్ మహా నగరానికి చేరుకునే పల్లె వాసులకు ఆర్సీఐ దారి చక్కటి ప్రత్యామ్నాయంగా మారింది. సొంతూర్ల నుంచి నగర శివారుకు రావడం ఒక ఎత్తయితే..అక్కడి నుంచి నగరంలోని తమ నివాసాలకు చేరుకోవడం మరో ఎత్తు. ఈ నేపథ్యంలో 2016లో అందుబాటులోకి వచ్చిన ఈ రహదారి ఎంతో ఊరటగా మారింది. శ్రీశైలం హైవే రూట్‌లోని అచ్చంపేట, కల్వకుర్తి, ఆమనగల్లు, కడ్తాల్, కందుకూర్ పట్టణాల సమీపంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలలో ఎక్కువ శాతం కర్మన్‌ఘాట్, చంపాపేట్, మీర్‌పేట, బడంగ్‌పేట, అల్మాస్‌గూడ ప్రాంతాలలో నివాసం ఉంటున్నారు. వీరంతా 2016కు ముందు ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే (ఆర్‌సీఐ రహదారి మోకాళ్ల లోతు గోతుల సమస్య కారణంగా) పహాడీషరీఫ్, జల్‌పల్లి కమాన్, షాహిన్‌నగర్, ఎర్రకుంట, చాంద్రాయణగుట్ట, బాబానగర్, మిధాని, ఓవైసీ చౌరస్తాలా మీదుగా కర్మన్‌ఘాట్ వైపు స్తంభించిన ట్రాఫిక్‌లో ప్రయాణించాల్సి ఉండేది.

దశలవారీగా..

2015-16వ సంవత్సరం నుంచి ఆర్సీఐ రహదారి దశలవారీగా అధునాతనంగా మారుతుండడంతో ఈ రోడ్డును ఆశ్రయించే వాహనదారుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. ఆర్‌సీఐ-బాలాపూర్ శివాజీ చౌక్ వరకు పలు దఫాలుగా విస్తీర్ణం దాల్చుకోవడం, శివాజీ చౌక్ నుంచి ఆర్సీఐ వరకు వన్ వే గా ఉన్న ఈ రహదారిని టూవేగా సైతం మార్చారు. దీంతో అప్పటి నుంచి వాహనాల సంఖ్య రెట్టింపయ్యాయి. బాలాపూర్ చౌరస్తా నుంచి ఆర్సీఐ కూడలి వరకు రోడ్డు విశాలంగా ఉండడంతో రాకపోకలు సాఫీగా సాగుతున్నప్పటికీ, ఆర్సీఐ కూడలి నుంచి పహాడీషరీఫ్ ప్రధాన రహదారి వైపు చేపట్టిన విస్తరణ పనులు పూర్తి చేస్తే వాహనదారులకు వెసులుబాటుగా మారనుంది.

వెంటనే ప్రారంభించాలి..

రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్సీఐ రహదారి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించాలి. రోడ్డు విస్తరిస్తే వాహనదారులకు సమయంతో పాటు ఇందనం కూడా ఆదా అవుతోంది. ఈ రహదారి అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి నగరానికి ఈ దారిలోనే వెళ్తున్నారు. చాంద్రాయణగుట్ట వైపు ఏదైనా రోడ్ల మరమ్మతులు జరిగినప్పుడు ఆర్టీసీ బస్సులు సైతం ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి.

– ఆంజనేయులు, వాహనదారుడు

అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే చర్యలు తప్పవు

హస్తినాపురం: అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నం నేపథ్యంలో హయత్‌నగర్ నుంచి చింతలకుంట వరకు కొంతమేర ట్రాఫిక్‌కు అంతరాయం జరుగుతున్నా ఎప్పటికప్పుడు తమ సిబ్బందితో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తున్నారన్నారు. విజయవాడ, నాగార్జున సాగర్ జాతీయ రహదారులపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని రహదారులపై అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే జరిమానాలు విధిస్తామన్నారు. చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తున్నామని, హస్తినాపురం జిల్లాపరిషత్ రోడ్డులో తెలంగాణ చౌరస్తా నుంచి టీకేఆర్ కమాన్ రోడ్డు వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాశామని వారి సహకారంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్పొరేటర్‌కు వినతి

వనస్థలిపురం: శ్రీ గాయత్రినగర్ కాలనీలో పార్కు, సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌ను కలిసి పార్కు, సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు.